
ఓ


జర్నలిస్ట్ డైరీ


(ఒక పాత్రికేయుని ప్రయాస)















'ఫుల్‌బ్రైట్ ఇంటర్వ్యూకు వెళ్ళిన తొలి భారతీయ జర్నలిస్ట్ నేనే'

ఆనందించిన 'అన్న'

టిక్కెట్టు దక్కి వుంటే నేనే ఎమ్మెల్యే

విలువల పునరుద్ధరణే ధ్యేయం

తొలి పాదయాత్రలో...


రాకెట్ టెక్నాలజీపై మోజు

మైనాస్వామి

మార్చ్ 14, 1994

ఎన్టీఆర్ తో 40 నిమిషాలు

సమకాలీన రాజకీయ పరిస్థితులు, ప్రజల స్థితిగతులు, తెలుగువారి ఆత్మగౌరవం ఆయనను చిత్రసీమ నుంచి రాజకీయ రంగంవైపు పయనించేలా చేశాయి. 30 యేండ్లకు పైగా తెలుగు సినీ ప్రపంచంలో మకుటంలేని మహారాజుగా వెలిగారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో జాతీయ స్థాయికి ఎదిగారు 'పద్మశ్రీ' డాక్టర్ నందమూరి తారక రామారావు. తెలుగు వారికి, తెలుగు భాషకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు తెచ్చారు ఎన్టీఆర్. ఒక ప్రాంతీయ పార్టీ ద్వారా దేశ రాజకీయాలనే మలుపు తిప్పిన నేత ఆయన. చదువుకొన్న వారికి, నచ్చీలురకు, బడుగువర్గాల వారికి సమున్నత స్థాయిలో రాజకీయ అవకాశాలు కల్పించా రు. మనదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి 1983 వరకు ఏ రాష్ట్ర శాసనసభలోనూ ఉన్నత చదువులు చదివినవారు ఎక్కువమంది సభ్యులుగా లేరు. ఒక్క రాష్ట్ర శాసనసభలోనే ఒకేసారి 170 మందికి పైగా చదువరులు ప్రవేశించారు. 1982 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల కోసం డా. రామారావు ఎంపికచేసిన అభ్యర్థులను చూసి కాంగ్రెస్ నాయకులు నవ్వుకోగా, సొంతపార్టీ వారు విస్తుపోయారు. 125 మంది డిగ్రీ, 28 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్, 47 మంది లా డిగ్రీ, 20 మంది డాక్టర్లు, 8 మంది ఇంజనీరింగ్ చదివినవారికి తెలుగుదేశం అధినేత నాటి ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం ఇచ్చారు. మహిళలకు మంచి ప్రాధాన్యత ఇచ్చారు.



ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ చాలా వేగంగా నిర్ణయాలు తీసుకొనేవారు. తాను తీసుకో వలసిన నిర్ణయం, చేయవలసిన పనిని చాలా వేగంగా చేసేవారు. సమకాలీన ముఖ్యమంత్రుల్లో ఎవరూ కూడా ఆ విధంగా సాహసం చేయలేదు. "సమాజమే దేవాలయం- పేదలే నా దేవుళ్ళు. వారికి కనీస సౌకర్యాలు కూర్చడం నా ప్రథమ కర్తవ్యం" అంటూ పేదల అభివృద్ధి కోసం పలు పథకాలు అమలుచేసిన నాయకుడు రామారావు. 1996లో పార్లమెంట్ మధ్యంతర ఎన్నికల రణానికి శంఖం పూరించి, యుద్ధభూమి లోకి వెళ్ళకముందే స్వర్గ సింహాసనాన్ని అధిష్ఠించిన మహానాయకుడు డా. నందమూరి తారకరామారావు. ఆంధ్రుల



అస్సగా కీర్తి తెచ్చుకొన్నారు. అణగారిన వర్గాలను ఎన్టీఆర్ ఎంతగా ఆదరించార నడానికి పాలెగార్ లింగరాజు రాజకీయ ప్రస్థానం మంచి ఉదాహరణ. అనంతపురం జిల్లా ఉరవకొండ ప్రాంతానికి చెందిన లింగరాజు (బి.సి.) అత్యంత సామాన్యుడు. ఎన్టీఆర్ మీద అభిమానంతో పార్టీలో చేరి, చురుగ్గా వ్యవహరించారు. కాకలు తీరిన యోధులు అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్ష పదవి కోసం పోటీపడగా, అందరినీ కాదని 1985లో లింగరాజును అధ్యక్షున్ని చేశారు రామారావు. 1987లో లింగరాజు జిల్లా పరిషత్ అధ్యక్షుడయ్యారు. తర్వాత కొన్నాళ్ళకు పార్టీ అధికారంలో లేనప్పుడు జొన్నా సూర్యనారాయణ (బి.సి.) జిల్లా అధ్యక్ష పదవిని చేపట్టారు. 2001 సంవత్సరంలో జొన్నా జిల్లా పరిషత్ ఛైర్మన్ అయ్యారు. అంతకుముందు బి.కె.పార్థసారధి (బి.సి.) జెడ్‌పి ఛైర్మన్‌గా పనిచేశారు. కర్నూలు జిల్లాలో కె.ఇ.క్రిష్ణమూర్తి (బి.సి.), ఎన్.ఎం.డి.ఫారూఖ్, కడప జిల్లాకు చెందిన రత్నసభాపతి (బలిజ). సి.రామ చంద్రయ్య(బలిజ)లను మంత్రులను చేసిన ఘనత ఎన్టీఆర్‌దే. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన బస్ కండక్టర్ బగ్గిడి గోపాల్ (బి.సి.), తిరుపతికి చెందిన వైద్యులు డాక్టర్ కత్తుల శ్యామల (బలిజ)లను శాసనసభ్యులను చేశారు. అదేవిధంగా అనంతపురం, చిత్తూరు, తిరుపతి స్థానాలను రామారావు బలిజలకు రిజర్వు చేశారు. ఆవిధంగా అణగారిన వర్గాలవారిని ఎన్టీఆర్ అక్కున చేర్చుకొన్నారు.




అటువంటి మహోన్నతమూర్తిని జర్నలిస్ట్ హోదాలోను, వ్యక్తిగతంగాను పలుసార్లు కలిశాను. 1980 అక్టోబ ర్‌లో 'సర్దార్ పాపారాయుడు' సినిమా చూసినప్పుడు "హీరో ఎన్టీఆర్‌తో మాట్లాడే అవకాశం జీవితంలో లభి స్తుందా" అని ఆలోచించాను. 1985 జూన్‌లో అనంతపురం జిల్లా హిందూపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పత్రికా ప్రతినిధుల సమావేశంలో కలుసుకొన్నాను. ఫోటోలు తీశాను. ఆయనతో మాట్లాడడం అదే తొలిసారి. (1985 మార్చి నుంచి



1996 వరకు రామారావు హిందూపురం ఎమ్మెల్యేగా కొనసాగారు). గోరంట్ల ఆంధ్రప్రభ విలేకరిగా వున్న నేను కెమెరా భుజానికి తగిలించుకొని అనంతపురం జిల్లా అంతా తిరుగుతూ ప్రజాసమస్యలపై ఎన్నో సచిత్ర వ్యాసాలు రాశాను. జర్నలిస్ట్‌గా మంచి గుర్తింపు పొందాను.

పొద్దున్నే ఆంధ్రప్రభలో తన ఫోటోలను చూసిన ఎన్టీఆర్ ఎంతో ఆనందించారు. వెంటనే అనంతపురం డి.పి.ఆర్.ఓ. అశ్వర్థనారాయణశెట్టిని అభినందించారు. 1986 నజవరి 26న ముఖ్యమంత్రి రామారావు తన సొంత నియోజకవర్గమైన హిందూపురంలో 'తెలుగు గ్రామీణ క్రాంతి పథం'ను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ముఖ్యమంత్రి పాల్గొన్న కార్యక్రమాల ఫోటోలు తీసి రాత్రి 8 గంటలకు ఆంధ్రప్రభ ఎడిషన్ కేంద్రం బెంగుళూరు చేరాను. ఆంధ్రప్రభలో తప్ప మరే తెలుగు దినపత్రికలోను ముఖ్యమంత్రి కార్యక్రమాల ఫోటోలు రాలేదు. ఆంధ్రప్రభ టైటిల్ కిందే బ్యానర్ న్యూస్‌లో ఎన్టీఆర్ పలు భంగిమల ఫోటోలు పెట్టారు. ఫోటోలు: మైనాస్వామి అని వుంది.

అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి ఎక్కడికి వచ్చినా నేను వెళ్ళి ఫోటోలు తీసి మరునాడే ఆంధ్రప్రభలో వచ్చేటట్టు చేసేవాన్ని. ఆ విధంగా ఎన్టీఆర్ దగ్గర గుర్తింపు లభించింది. రాయలసీమ దేవాలయాలు–చారిత్రక, పర్యాటక ప్రదేశాలపై నేను రాసిన 'రాయలసీమ అపూర్వ కళాఖండాలు' పుస్తకాన్ని 1994లో రామారావుకు హైదరాబాద్‌లో ఇచ్చాను. పుస్తకాన్ని తిరగేసి 'రాయలసీమ... రతనాలసీమ. సిరులు పొంగి పొరలిన సీమ. మంచి కృషిచేశారు బ్రదర్' అని అభినందించారు. 1993లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్ చార్జీలు పెంచినందుకు నిరసనగా తిరుపతి ఆర్టీసీ బస్టాండు ఎదుట ప్రతిపక్ష నేత ఎన్టీఆర్ ధర్నా నిర్వహించారు. సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్ళడానికి రైల్వేస్టేషన్ చేరుకొన్నారు.





ప్రయాణికుల హాల్‌లో ఆయన కూర్చొన్నారు. చంద్రబాబు నాయుడుతో పాటు మరికొందరు హాల్ బయటే ఏదో మాట్లాడు కొంటున్నారు. నేను, ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ రవికుమార్ లోపలి కెళ్ళాం. అంతలో జనత రిపోర్టర్ గోపాలరెడ్డి, ఈనాడు ప్రతినిధి రవి తదితరులు వచ్చారు. ఎన్టీఆర్‌తో మాట్లాడడానికి ఎవరూ సాహసించలేదు. అంతలో నేను "సర్.. ప్రెస్ వాళ్ళంతా వచ్చారు" అని అన్నాను. ఆయన అటూ ఇటూ చూశారు. ప్రయాణికుల హాల్‌లో కూర్చోడానికి కుర్చీలు లేవు. దానితో ఎన్టీఆర్ లేచి నిలబడి "చెప్పండి బ్రదర్" అన్నారు. "మీరు కూర్చోండి సార్... మేం నిలబడే వుంటాం" అన్నా ఆయన వినిపించుకోకుండా హాల్‌లో నుంచి బయటకు వచ్చి ప్లాట్‌ఫామ్–1పై నిలబడి పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. "దుష్ట కాంగ్రెస్... బస్ చార్జీలను పెంచి సామాన్యులపై భారం మోపింది. ప్రజలను వంచించింది" అంటూ హావభావాలు ప్రదర్శిస్తూ మాట్లాడారు. అటూ ఇటూ వెళుతున్న రైలు ప్రయాణికులు ఎన్టీఆర్‌ను ఆసక్తిగా చూశారు. ***తిరుపతి రైల్వేప్లాట్ ఫామ్ మీద ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టిన మాజీ ముఖ్యమంత్రి లేదా ప్రతిపక్ష నేతను ఎన్టీఆర్ మినహా 24 సంవత్సరాల జర్నలిస్ట్ జీవితంలో నేనెవరినీ చూడలేదు.***

1994 మార్చి 14. సమయం ఉదయం 6.50 గంటలు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 13లోని ఎన్టీఆర్ ఇంటికి వెళ్ళాను. 7 నుంచి 7.15 వరకు ఎన్టీఆర్ నాకు సమయం కేటాయించారు. పది నిమిషాల ముందే అక్కడికి చేరుకోవడంతో "అన్న" పి.ఏ. మోహన్ 'సార్ ఇంకా సీట్లోకి రాలేదు. వచ్చిన వెంటనే పంపుతాను" అని అన్నారు. సరిగ్గా 7 గంటలకు గంట మోగింది. ఎన్టీఆర్ వున్న గదిలోకి వెళ్ళాను. రెండుచేతులు జోడించి నమస్కారం పెట్టాను. "నమస్తే బ్రదర్... కూర్చోండి" అంటూ కుర్చీ చూపారు. "సుప్రభాతం" (రాజకీయ వారపత్రిక) తాజా సంచిక చేతిలో పెట్టాను. అందులో "ఎన్టీఆర్ ఎన్నికల పర్యటనకు నాంది" అని మార్చి 2, 3 తేదీల్లో హిందూపురంలో జరిగిన సభ–పర్యటనలను దృష్టిలో వుంచుకొని ప్రత్యేక వ్యాసం రాశాను. అది చూసిన రామారావు "థాంక్యూ" అని నవ్వుతూ అన్నారు. "మీతో ప్రత్యేక ఇంటర్వ్యూ చేయాలి... సర్" అన్నాను. "ఇంటర్వ్యూలు ఎప్పుడూ వుండేవే. రాయలసీమ సంగతులు చెప్పండి" అని "అన్న" అడిగేసరికి నాకు ఏమీ పాలుపోలేదు. సీమ సంగతులు అంటే పార్టీ స్థితిగతులపై ప్రతి జిల్లా అందులో కొన్ని ముఖ్యమైన నియోజకవర్గాల్లో ఎవరికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇంతకుముందు ఎన్టీఆర్ వద్ద లబ్ధిపొందిన వారు పార్టీకి వుపయోగపడ్డారా అనే విషయాలను వివరించాను. నేను చెప్పిన విషయాలు చాలా ఆసక్తిగా వింటున్నారు. మధ్యలో ఎన్టీఆర్ రాజకీయ కార్యదర్శి



శ్రీహరికోట అంతరిక్షకేంద్రంలో 1987లో ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీతో ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్.

రతన్‌బాబు వచ్చి "సర్ ఫలానా వాళ్ళు వెయిట్ చేస్తున్నారు" అని కొన్ని పేర్లు చెప్పారు. "వారిని వేచి వుండమని చెప్పండి" అని రతన్‌బాబుతో అంటూ "మీరు చెప్పండి బ్రదర్" అని గడ్డం కింద చేయి పెట్టుకొని నవ్వారు. కడప జిల్లాలో కులాల ప్రస్తావన చేశాను. సి.రామచంద్రయ్య పేరు చెప్పగానే "అతనికి ఎన్నో అవకాశాలు ఇచ్చాం, సద్వినియోగం చేసుకోలేదు" అని తీవ్ర స్వరంతో అన్నారు. అంతలో శ్రీమతి లక్ష్మీపార్వతి రాగిచెంబులో నీళ్ళు తెచ్చి రామారావుకు ఇచ్చారు. ఆ నీళ్ళు తాగిన తర్వాత కొంత శాంత స్వరూపులయ్యారు. బి.సి.లపై చర్చ జరుగుతున్నది. మళ్ళీ రతన్‌బాబు వచ్చారు. అప్పటికే 7.30 గంటలైంది. నాకు ఇచ్చింది 15 నిమిషాలు మాత్రమే. నేను పైకి లేచాను. కూర్చోమంటూ రామారావు సైగ చేశారు. చివరగా అనంతపురం జిల్లా గోరంట్ల నియోజకవర్గం గురించి మాట్లాడాను. 7.40 గంటలకు లేచి నమస్కరించి అక్కడినుంచి నిష్క్రమించాను. ఎన్టీఆర్‌ను పదేపదే కలుస్తుండడంతో సుప్రభాతం అప్పటి ఇన్‌చార్జ్ శాంతారాం, రిపోర్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య మైనాస్వామి టిడిపి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నట్టుంది అని అన్నారు. నిజానికి నేను ఎన్టీఆర్‌ను కలిసింది ప్రత్యేక ఇంటర్వ్యూ చేసి సుప్రభాతంలో ప్రచురిస్తామనే. ఎందుకంటే 1994 మార్చి 3న హిందూపురంలో కలిసినపుడు ఇంటర్వ్యూ కోసం ప్రయత్నించా. రామారావుతో మామూలుగా మాట్లాడా. ఇంటర్వ్యూ కుదరలేదు.

కాగా 1994 అక్టోబర్‌లో గోరంట్ల నియోజకవర్గ టిక్కెట్ విషయమై ఎన్టీఆర్‌తో మాట్లాడా, నాకోసం కాదు. నా మిత్రుడు పుట్టపర్తి వాసి కె.ఎ.ఎన్.మూర్తి (బి.సి.) కోసం మూర్తికే గోరంట్ల టికెట్ దాదాపు ఖాయమైంది. కొన్ని కారణాల వల్ల మూర్తికి టిక్కెట్ ఇవ్వనందున 1994 డిసెంబర్ 15న మూర్తి సెరికల్చర్ ఫెడరేషన్ కార్పొరేషన్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఆరోజు కేవలం 3 కార్పొరేషన్లకు మాత్రమే ఛైర్మన్‌లను నియమించగా అందులో మూర్తి ఒకరు. నిజానికి నన్నే గోరంట్లకు పార్టీ టికెట్ అడగమని పలువురు మిత్రులు ప్రోత్సహించారు. తెలుగు యువత అప్పటి నాయకుడు నరసింహపల్లి రామలింగారెడ్డి మైనాస్వామి టికెట్ అడిగితే అన్న కాదనరు అని అనంతపురం జిల్లా టిడిపి నాయకుల ముందు వ్యాఖ్యానించారు. కొన్ని ప్రత్యేక కారణాల వల్లనే నేను ఎన్టీఆర్‌ను టికెట్ అడగలేదు. ఎన్టీఆర్, చంద్రబాబుతో సహా పలువురు రాష్ట్ర నాయకులతో నాకు సన్నిహిత సంబంధాలుండేవి. గోరంట్ల నియోజకవర్గం అప్పటి ఎన్నికల ఖర్చు 2 లక్షలు మాత్రమే. అంతకుముందు ఎన్నికల ఖర్చు వేలల్లోనే వుండేది.

(టూరిజం న్యూస్, మే-జూన్ 2008)

'నా సలహా పాటించివుంటే ఆయనే సి.ఎం.'

'ఒరేయ్‌రిక్షా' సినిమా ఆ రోజు షూటింగ్ ముగి సిన తర్వాత 'దర్శక రత్న' డాక్టర్ దాసరి నారాయణరావు నేను ఇద్దరూ తిరుపతిలో ఆయన దిగిన హోటల్ గదికి వెళ్ళాము. శ్రీ దాసరి మద్దతు కోరుతూ శ్రీమతి లక్ష్మీపార్వతి ఫోన్ చేశారు. "ఎన్టీఆర్ బొమ్మ పెట్టుకొని గెల్చినవారు చంద్రబాబును సమర్థించడం సబబా. వ్యక్తిగతంగా మీ మద్దతును ఎన్టీఆర్‌కి తెలపండి" అని శ్రీమతి లక్ష్మీపార్వతి కోరారని దర్శకరత్న నాతో చెప్పారు. "ఏమి చేద్దాం? ఎన్టీఆర్‌కు ఏ విధంగా సాయం చేద్దాం?" అని అంటూ ఆయన ఆలోచనలో పడ్డారు. **సుమారు ఏడెనిమిది సంవత్సరాల నుంచి సరికొత్త రాజకీయ శక్తి గురించి డా. దాసరి నారాయణరావు, నేను మాట్లాడుకొంటూనే వున్నాం. పీడిత, తాడిత ప్రజలకోసం, అణగారిన వర్గాల కు రాజకీయ ఫలాలను అందించడానికి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి చారిత్రక అవసరాన్ని గుర్తుచేస్తూ అప్పటికే నేను పలు వార్తావ్యాసాలు రాశాను. రాతలకే పరిమి తం గాకుండా నా ఆలోచనలు ఇష్టపడే వారితో చర్చించేవాన్ని.** రాజకీయ కోణం నుంచే దాస రితో నాకు సన్నిహితత్వం పెరిగింది. హైదరాబాద్ లో ఎన్టీఆర్‌తో మాట్లాడవలసిన అజెండా గురించి ఇద్దరం చర్చించాం. ***"ఎన్టీఆర్ జాతీయ రాజకీయా లు చూసు కొంటారు. మీరు రాష్ట్ర రాజకీయాలు చూసు కోండి"*** అని సలహా ఇచ్చాను. 'ఇదే విష యాన్ని ఎన్టీఆర్ ఒప్పు కొంటే మీరు ఆయన పార్టీలోనే చేరవచ్చు' అనికూడా దాసరితో చెప్పాను. ఎన్టీఆర్‌తో చర్చలు సఫలం కాలేదు. అంతలో లోక్‌సభ మధ్యంతర ఎన్నికల నగారా మోగింది. 1996 జనవరి 18న ఎన్టీఆర్ మరణించారు.

ఇలావుండగా కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావం కోసం రాష్ట్రంలోని పలు పట్టణాలు తిరిగాను. పలువురు ప్రముఖులను కలిశాను. శ్రీమతి లక్ష్మీపార్వతి సారధ్యంలోని ఎన్టీఆర్ టి.డి.పి. 1996 మధ్యంతర ఎన్నికల్లో కనీసం ఒక్క సీటు గెలవకపోయినా ఒక్కోచోట లక్షలాది ఓట్లను దక్కించుకోవడం జరిగింది.





సొంతంగా పార్టీ పెట్టాలన్న యోచనతో శ్రీ నారాయణరావు ఎన్టీఆర్ టిడిపికి దూరంగా వున్నారు. సినీతారగా విజయ శాంతికి పునర్జన్మ ప్రసాదించిన 'ఒసేయ్‌రాములమ్మా' విజయం అణగారిన వర్గాల్లో నూతనో త్సాహాన్ని నింపింది. కొత్త రాజ కీయ పార్టీపై చర్చలు జరుగుతు న్నాయి. సామాజిక న్యాయసద స్సు నల్గొండ జిల్లా సూర్యాపేట లో 1997లో జరిగింది. ఆ సదస్సుకు అద్భుత స్పందన లభించింది. కొత్త పార్టీ స్థాపనకు ఇదే అనువైన సమయం అని పలువురు ప్రముఖులు నాకు ఫోన్లుచేశారు. అదే విషయాన్ని దాసరితో మాట్లాడాను.

కాగా ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ బి.ఎస్.అమరనాథ్ హెర్బల్ (డాక్టర్) బిస్కట్స్‌ను కొత్తగా మార్కెట్‌లోకి విడుదల చేయాలనినాతో అన్నారు. దర్శకరత్నతో చేయిద్దామని అన్నా. సరేనన్నారు. హైదరాబాద్‌లో దాసరి ముఖ్య అతిథిగా ఆ సభ బాగా జరిగింది. కొత్త రాజకీయ పార్టీకోసం ఎదురుచూస్తున్న వారిలో ముఖ్యులను ఆ సభకు నేను పిలిచాను. రాష్ట్ర బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీ ఆర్.క్రిష్ణయ్య, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు శ్రీ మందక్రిష్ణ మాదిగ, కొందరు ఎమ్మెల్యేలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు అందరూ డాక్టర్ బిస్కట్స్ సభలో పాల్గొన్నారు. బాలనటుడు జూనియర్ ఎన్టీఆర్ కూడా ఆ సభలో పాల్గొన్నాడు. రాత్రి విందు ముగిశాక అందరూ దాసరి ఇంటికి వెళ్ళాం. తెల్లవారుజామున 3 గంటలదాకా వచ్చిన వారందరితో విడివిడిగా సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించాం. పార్టీని ప్రకటించాలని ఎక్కువమంది కోరారు. "ప్రత్యామ్నాయ రాజకీయ శక్తికోసం మైనాస్వామి చాలా కష్టపడుతున్నాడని" ఆర్.క్రిష్ణయ్య, డా.అమరనాథ్ తదితరులు నాపై ప్రశంసల వర్షం కురిపించారు.

విద్యావంతులను ముఖ్యంగా న్యాయవాదులను, వైద్యులను, అధ్యాపకులను పలువురిని దాసరికి పరిచయం చేశాను. తెలుగు దేశం, కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తివాదులను కూడా కలిసి మాట్లాడాను. హైదరాబాద్‌లో ***1997 నవంబర్ 19న జరిగే సమావే శానికి రమ్మని అందరినీ ఆహ్వానిం చాను. అదే రోజు ఉదయం శ్రీరాములయ్య సినిమా షూటింగ్ ప్రారంభో త్సవం. ముఖ్యఅతిథి డా. దాసరి నారాయణరావు.*** హీరో మోహన్‌బాబు. నిర్మాత పరిటాల రవి (పెనుకొండ ఎమ్మెల్యే). శ్రీరాములయ్య షూటింగ్ ప్రారంభోత్సవ సభ ముగిశాక దాసరి, నేను రామానాయుడు స్టూడి యో నుంచి బయటకు వచ్చాం. ఆయన అమీర్‌పేట



వెళ్ళారు. నేను బషీర్‌బాగ్‌లోని 'సుప్రభాతం' ఆఫీస్‌కు వచ్చాను. ఆఫీస్‌లో కూర్చొన్న అరగంటలో జూబ్లీ హిల్స్‌లో కార్‌బాంబ్ విస్ఫోటనం జరిగినట్టు సమాచారం అందింది. వెంటనే దాసరికి ఫోన్‌చేసి విషయం చెప్పా. ఆ రోజు జరగాల్సిన అతి ముఖ్యమైన సమావేశాన్ని వాయిదా వేశాం.

నేను స్థాపించిన 'ఐక్య వేదిక' సదస్సు 1997 డిసెంబర్‌లో తిరుపతిలో జరపాలని అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నా. మాజీ ప్రధాని శ్రీ దేవేగౌడ, తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి. కర్నాటక మాజీ ముఖ్యమంత్రి శ్రీ వీరప్పమొయిలీ, శ్రీ దాసరి తదితరులు సభలో పాల్గొనేటట్టు పథక రచన చేశా. శ్రీ దేవేగౌడ అందరికంటే ముందు సానుకూలంగా స్పందిం చారు. మన రాష్ట్రానికి చెందిన బి.సి., ఎస్.సి., ఎస్.టి., మైనారిటీల సంఘాల నాయకులు కూడా సభ పట్ల బాగా స్పందించారు. 'సోషలిస్ట్ పార్టీ' స్థాపకుడు డాక్టర్ రాం మనోహర్‌లోహియా శిష్యుడు, లోహియా సిద్ధాంత (సామాజిక న్యాయం) కర్త శ్రీ తుర్లపాటి సత్యనారాయణ ఆనందానికి అవధులు లేవు. "మైనాస్వామీ వెనుదిరిగి చూడకు. ఉజ్వలమైన భవిష్యత్ వుంది. ముందుకు వెళ్ళు" అని ఆశీర్వదించారు. (డాక్టర్ నందమూరి తారక రామారావు పార్టీ పెట్టినప్పుడు శ్రీ తుర్లపాటి పలు సలహాలు ఇచ్చారు.) ఐక్యవేదిక సదస్సును దాసరి వాయిదా వేయించారు. "ఇక సభలు - సమావేశాలు వద్దు. పార్టీ ఏర్పాటు ప్రకట న, తర్వాత బహిరంగ సభ తదితర అంశా లపై దృష్టి పెడదాం" అని శ్రీ నారాయణ రావు నాతో అన్నారు. 'లోక్ సభ మధ్యంతర ఎన్నికలు (1998) అయ్యాక పార్టీ ప్రకటిస్తే బాగుంటుంది' అని అన్నాను. 'లోక్‌సభకు పోటీ చేస్తున్నాం' అన్నారాయన. నా మనసు కొంత గందరగోళంలో పడింది. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికలే ముఖ్యం. శాసనసభలో పాగా వేయాలన్నది నా అభిమతం మాత్రమే కాదు మెజారిటీ మేధావుల అభిప్రాయం. రాజకీయ హడావిడిలో దాసరి ఇంట్లో ఒక మహా వ్యక్తి పరిచయ భాగ్యం కలిగింది. ఆ మహానుభావుడి పేరు శ్రీ బి.ఎన్.రెడ్డి. తెలంగాణా పోరాట యోధుడు, త్యాగశీలి, రాజకీయ దురంధరుడు, ఎం.పి.గా నాలుగుసార్లు గెల్చినా అత్యంత నిరాడంబర జీవితాన్ని గడుపుతున్న నేత. కొత్త రాజకీయ శక్తి గురించి ఆ కమ్యూనిస్ట్ నేతతో గంటలు గంటలు చర్చించాను. (మూడేండ్ల కిందట శ్రీ బి.ఎన్.రెడ్డి మరణించారు).

కాగా పార్టీ ప్రకటన తేదీ దగ్గర పడుతున్న కొద్దీ రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నా. పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు నన్ను నిత్యం సంప్రదిస్తు న్నారు. కొందరిని దాసరి ఇంటికి తీసుకొని వెళ్ళా. ఎమ్మెల్యేలు శ్రీ జొన్నా సూర్యనారాయణ (కదిరి – అనంతపురం జిల్లా), శ్రీ మోతుకపల్లి నరసింహు లు (ఆలేరు – నల్గొండ జిల్లా), శ్రీ గాలి ముద్దుక్రిష్ణమ నాయుడు (పుత్తూరు – చిత్తూరు


జిల్లా), శ్రీ కిష్టారెడ్డి (కల్వకుర్తి – మహబూబ్‌నగర్ జిల్లా), ఎ.మోహన్ (తిరుపతి).. ఆ విధంగా 9 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎం.పి.ని పార్టీ ప్రకటనకు ముందే సిద్ధం చేశాను. పార్టీ ప్రకటించే సమయంలోనే ఎమ్మెల్యేలు చేరుతున్నట్లు చెబితే ప్రజల్లోకి బలమైన సంకేతాలు పోతాయని నేను శ్రీ దాసరికి చెప్పా." "వారందరినీ బహిరంగ సభలో పార్టీలో చేర్చుకొందాం. పార్టీ ప్రకటించేటప్పుడు నేనొక్కడే వుండాల"న్నారు. 1998 డిసెంబర్ 19న తెలుగుతల్లి పార్టీని స్థాపిస్తున్నట్లు డా. దాసరి నారాయణ రావు ప్రకటించారు. పత్రికలన్నీ పతాక శీర్షికలో వార్తలు రాశాయి. ఈనాడు మాత్రం అతితక్కువ ప్రాధాన్యత ఇచ్చి లోపలి పేజీలో ఒక మూలన పడేసింది. అప్పుడు ఈనాడు అధిపతి డా. చెరుకూరి రామోజీరావు, డా. దాసరి మధ్య విభేదాలుండేవి. దాసరి నారాయణరావు పేరును పత్రికలోను, ఈటివిలోనూ 'కట్' చేసేవారు. తెలుగుతల్లి స్థాపనకు సంబంధించి హైదరాబాద్ నిజాం కళాశాల మైదానంలో జనవరి 8న పెద్ద బహిరంగ సభ జరుగుతుందని అధ్యక్షుడు ప్రకటించారు. పార్టీ ప్రకటన ప్రెస్‌మీట్ అయిన తర్వాత తొలి రెండు పిరాకాలను ఇద్దరు స్నేహితుల ద్వారా నేనే అందించా. పార్టీ ప్రకటన వెలువడిన గంట తర్వాత జాతీయ పార్టీల నాయకులు కొందరు తెలుగుతల్లి అధ్యక్షునికి ఫోన్లు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు గురించి ప్రస్తావించారు. జాతీయ పార్టీల నాయకులతో మాట్లాడడానికి నేను, మరో మిత్రుడు ఢిల్లీ వెళ్ళాలని నిర్ణయించాం. ఆమేరకు డిసెంబర్ 20 రాత్రి 8-30 గంటలకు విమానం టిక్కెట్లు బుక్ చేశాం. ఆ రోజు సాయంత్రం ఢిల్లీ ప్రోగ్రామ్ రద్దయింది. కొందరు నేతలు హైదరాబాద్ వచ్చి మాట్లాడు తారని దాసరి చెప్పారు. తెలుగుతల్లితో పొత్తు పెట్టుకోవాలని బి.జె.పి. నేతలు అత్యంత ఉత్సాహం చూపారు. 18 రోజుల తర్వాత నిజాం కళాశాల మైదానంలో జరుగనున్న బహిరంగ సభ గురించి మాట్లాడుకొన్నాం. రాయల సీమ జిల్లాలు నన్ను చూడమన్నారు దాసరి. అదే రోజు రాత్రి బయలు దేరి, కడపలో మరునాటి ఉదయం ముఖ్యుల సమావేశం నిర్వహించా.

తిరుపతిలోనూ ఒక మీటింగ్ పెట్టి మదనపల్లికి పోయాను. కదిరి, గోరంట్ల, పుట్టపర్తి ధర్మవరం చూసుకొని అనంతపురం చేరాను. 'తెలుగుతల్లి' పార్టీని సీమలో తొలిసారిగా నడిపించింది నేనే. తిరుపతిలో ఒక అంబాసిడర్ కారు బాడుగకు తీసుకొని సీమ అంతటా తిరిగాను. ఒక రోజు వార్తలో ఫ్రంట్ పేజీలో చిన్న వార్త చూసి అదిరిపోయాను. తెలుగుతల్లి బహిరంగ సభ వాయిదా అని 'వార్త' వచ్చింది. వెంటనే పార్టీ అధ్యక్షునికి ఫోన్ చేశా. 'అవును వాయిదా పడే అవకాశం వుంది' అని ఆయన అన్నారు. అప్పటికే వేలాది కరపత్రాలు నాపేరు మీదుగా పంపిణీ అయ్యాయి. పత్రికల్లో ప్రకటనలు వేశాను. 'బహిరంగ సభకు తరలిరండి' పేరుతో పోస్టర్లు ఆర్డర్ ఇచ్చాను. మరుసటి రోజు ముద్రణ జరుగనుంది. తలపట్టుకొన్నా. "ఎంత కష్టం? ఎంతెంత నష్టం?" అని ఆలోచించుకొంటూ హైదరాబాద్ వెళ్ళాను.

"ఒక ఎమ్మెల్యేను వెంటబెట్టుకొని వస్తున్నా" అని అధ్యక్షునికి చెప్పా. సాయంత్రం ఎమ్మెల్యే- నేను ఇద్దరం శ్రీ నారాయణరావు ఇంట్లో కూర్చొన్నాం. శ్రీమతి దాసరి పద్మతో సహా ఇంట్లోని వారంతా ఆ ఎమ్మెల్యేను చూసి ఆశ్చర్యపోయారు. ఆయనే.. పెనుకొండ ఎమ్మెల్యే పరిటాల రవి. దాసరి, రవి, నేను ముగ్గురం 3 గంటల సేపు ఎడతెరపి లేకుండా

చర్చించుకొన్నాం. మైనాస్వామి హిందూపురం నుంచి లోక్‌సభకు పోటీ చేస్తారని కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చాయి. చివరకు తెలుగుతల్లి పార్టీ స్థాపించకుండానే రద్దయింది. 1999 సాధారణ ఎన్నికల్లో దాసరి కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం నిర్వహించారు. 2000 సంవత్సరంలో కాంగ్రెస్ తరపున రాజ్యసభకు ఎన్నికయ్యారు. తర్వాత 2004 మేలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి అయ్యారు. మళ్ళీ ఏనాడూ దాసరిని కలవలేదు. ఆయనే స్వయంగా తిరుపతిలో నా ఇంటికి వచ్చిన సందర్భాలున్నాయి. నేడు రాష్ట్రంలో మంత్రులుగా వున్న కొందరు నా సలహాల కోసం, వారి రాజకీయ ఎదుగుదల కోసం నా చుట్టూ తిరిగారు. నా పేరు జపించారు. నాకు తెలిసిందల్లా ఇతరులకు సాయం చేయడమే. తిరిగి వారి నుంచి సాయం పొందడం తెలియక కాదు. సాయపడే వాన్నే కానీ సాయం తీసుకొనే వాన్ని కాను. వేలాది మందికి సాయం చేసే అవకాశం దొరికినందుకు సంతోషిస్తుంటాను.

కాగా **1998** లోక్‌సభ ఎన్నికల్లో దాసరి బిజెపితో పొత్తు పెట్టుకొని వుంటే రెండెంకెల స్థానాల్లో లోక్‌సభ సీట్లు ఖచ్చితంగా వచ్చి వుండేవి. ఆనాడు దాసరిపై, బిజెపిపై ఓటర్లకు మంచి అభిప్రాయం వుండేది. 'బిజెపికి దగ్గరయితే.. మనకు ముస్లిమ్‌లు, దళితులు దూరమవుతా"రని ఆయన నాతో పలుమార్లు అన్నారు. ఎన్టీఆర్ జీవించి వున్నప్పుడే ఆయనతో చేతులు కలిపి వుంటే **1996** లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో పరిస్థితి మరోలా వుండేది. డా. దాసరి నారాయణరావు ఎటువైపు అడుగు వేసినా రాజకీయ చరిత్ర సృష్టించి వుండేవారు. అందివచ్చిన అవకాశాలను వదులుకొని చారిత్రక తప్పిదం చేశారు దాసరి. ఆయనకు అది తప్పు, పొరబాటు అనిపించకపోవచ్చు. కాంగ్రెస్‌లో చేరి కేంద్ర సహాయ మంత్రి పదవి స్థాయికి ఎదగడం ఆయన సాధించిన విజయమే. కానీ దాసరి వంటి అద్భుత దర్శకుని స్థాయికి ఆ పదవి చిన్నదే. ఆయన అత్యున్నత పదవిని అలంకరించివుంటే ఆయన సహచరుల్లో పలువురికి చట్టసభల్లో కూర్చొనే అవకాశం దక్కి వుండేది. క్యాడర్‌ను కాపాడుకొని వుంటే బలమైన లీడర్‌గా ఎదిగివుండేవారు. కాంగ్రెస్ వంటి మహాసముద్రంలో దాసరి నారాయణరావు ఒక నీటి బొట్టులా వున్నారు. పార్టీ ప్రకటించినపుడు పార్లమెంటుకు పోటీచేసివుంటే ఖచ్చితం గా కేంద్రంలో అప్పుడే మంత్రి అయి, రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదిగివుండేవారు. నా సలహా పాటించి వుంటే **1999**లో ఆయనే సి.ఎం. అయివుండేవారు.



(టూరిజం న్యూస్, మార్చ్ -ఏప్రిల్ 2010)